


నగరంలోని తెలంగాణభవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, మహేశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్

# అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా చూడాలి




పోటీలను ప్రారంభిస్తున్న వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

### జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

**వికారాబాద్, ఫిబ్రవరి 19 :** తల్లిదండ్రులు అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా చూడాలని వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి తెలిపారు. బుధవారం వికారాబాద్ కేజీబీవీ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (మహిళా శిశు సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారిణి) ఉమా హారతి ప్రారంభించారు. 'బేటీ బచావో– బేటి పడావో' పది సంవత్సరాల వేడుకలో భాగంగా అన్ని కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో జట్టుతో మొదట మండల స్థాయిలో ఆడించి గెలుపొందిన వారికి నియోజకవర్గం స్థాయిలో ఆటలు పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖోలో ధారూర్ కేజీబీవీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలు అన్ని రంగాల్లో అబ్బాయిలను మించి రాణించాలన్నారు. తల్లిదండ్రులు అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా చూడాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని దృఢ సంకల్పంతో ఉండాలని అన్నారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో విద్యార్థినిలు సమాజంలో ధైర్యంగా నిలబడాలని వివరించారు. చదువుతో పాటు ఆటలు కూడా చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కేజీబీవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు,మహిళా సాధికారత బృందం పాల్గొన్నారు.



# సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్ కూల్చివేత

**ఎల్బీనగర్ 19:** సరూర్‌నగర్‌లోని ఉన్న వాణిజ్య సముదాయాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు షాపులు ఖాళీ చేయించి బుధవారం నుంచి హెచ్‌ఎండీఏ అధికారులు కూల్చివేస్తున్నారు. కూల్చివేతల కోసం రెండు భారీ హిటాచీ వాహనాలను వాడుతున్నారు. భవనం ముందు భాగంలోని నిర్మాణాలను ముందుగా కూల్చివేశారు. కాగా ఆ స్థలంలో ప్రజా ఉపయోగ భవనం నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కిడ్నాపర్ల అరెస్ట్..

### రెండేళ్ల బాలుడిని తల్లి వద్దకు చేర్చిన పోలీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): మూడురోజుల క్రితం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిడ్నాపైన రెండేళ్ల బాలుడిని స్థానిక పోలీసులు ఫిర్యాదు అందిన 48 గంటల్లో రక్షించారు. ఆ బాలుడిని అమ్ముదామని లేదా భిక్షాటన కోసం వాడుకుందామని ప్రయత్నించిన నలుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్‌లతో కలిసి తెలిపారు. షేక్ అమెర్ అలియాస్ తార మద్యం మత్తులో ఉన్న తల్లిదండ్రులను వెతికి వారి వద్ద ఉన్న పిల్లలను తన ముఠా సాయంతో కిడ్నాప్ చేసి పిల్లలు లేని వారికి, పిల్లలతో భిక్షాటన చేయించే వారికి అమ్ముతాడు. ఐదురోజుల క్రితం కడప జిల్లా మైలవరం మండలం బద్వేల్ గ్రామానికి చెందిన బండెల దేవి అనే మహిళ తన రెండేళ్ల కుమారుడు ప్రేమ్‌తో కలిసి నగరానికి పని కోసం వచ్చింది. ఈనెల 15న ఆమె గౌలిగూడ ఫుట్‌పాత్‌పై మద్యం మత్తులో నిద్రిస్తుండగా ఆమె కుమారుడు ప్రేమ్‌ను దుండగులు కిడ్నాప్ చేశారు. తాను నిద్ర లేచిన తర్వాత వెతికితే కుమారుడు కనిపించకపోవడంతో అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఈనెల 16న ఫిర్యాదు చేసింది. సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసిన పోలీసులు బాలుడి కిడ్నాపర్లను, వారి కదలికలను గుర్తించారు. మూడుటీమ్‌లుగా ఏర్పడి కిడ్నాపైన బాలుడిని రక్షించారు. ఈ కేసులో షేక్ అమీర్ అలియాస్ తార, మజిదాబేగమ్ , మహ్మదీబేగమ్‌లను అరెస్ట్ చేయగా అబ్దుల్ సల్మాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిడ్నాపైన బాలుడిని తల్లివద్దకు సురక్షితంగా చేర్చారు. 48 గంటలలోనే కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్లు మధుకుమార్, ఎన్‌రవిలతో పాటు ఎస్‌ఐ జగదీశ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.



# ఆ 105 ఆస్తులను ఏంచేస్తారో?

- కేబీఆర్ పార్కు చుట్టూ ఆస్తుల స్వాధీనంపై స్పష్టత లేకుండా బల్దియా ప్రతిపాదనలు
- గతంలో రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను తిరస్కరించిన సభ్యులు
- జానారెడ్డి బాటలోనే కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం
- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : అంతా హడావుడి తప్ప ప్రణాళిక ఉండదు. కార్యాచరణ అస్సలు రూపొందించరు. సమావేశాల మీద సమావేశాలు పెడుతారు కానీ నిర్ణయాలు తీసుకోవడంలో ఎడతెగని జాప్యం చేస్తారు. ఇదీ బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ తీరు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 15 అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలపనున్నారు. ముఖ్యంగా ఈ స్టాండింగ్ కమిటీ సమావేశంలో హెచ్ సిటీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా భూ సేకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే గత స్టాండింగ్ కమిటీలో సభ్యులు తిరస్కరించిన ప్రతిపాదనలనే మళ్లీ ఈ సమావేశంలో పొందుపర్చడం, కొత్తగా కేబీఆర్ పార్కు చుట్టూ ఎవరెవరి ఆస్తులను గుర్తించారు? ప్రముఖులు ఎవరు ఉన్నారు? అన్న సమగ్ర వివరాలు లేకుండానే రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆమోదానికి పంపడం దీనికి సభ్యులు ఎలా స్పందిస్తారన్న చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ప్రాజెక్టు కింద తమ ఆస్తులను ఇచ్చేందుకు ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేత జానా రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడం, ఇటీవల సినీ హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి సైతం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నేటి సమావేశంలో 105 ఆస్తులకు సంబంధించి సభ్యులు ఏ విధంగా స్పందిస్తారన్న ఉత్కంఠగా మారింది. వీటితో పాటు బండ్లగూడ మండలం కందికల్ గ్రామంలో మిధాని బస్‌స్టేషన్, బస్ డిపో నిర్మాణానికి టీజీఎస్ ఆర్టీసీకి కేటాయించిన 5.37 ఎకరాల ప్రభుత్వ భూమికి ఎన్‌ఓసీ జారీ చేసేందుకు జీహెచ్‌ఎంసీకి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారు. బుద్ధభవన్‌లో నాలుగో అంతస్తు ఏ బ్లాక్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లీజు వ్యవధి తదుపరి రెండు సంవత్సరాల పొడగింపునకు , అద్దె పెంపు, బోరబండలోని స్లమ్ ఏరియాలో నిరుద్యోగ యువత, నిరుపేద మహిలలకు సీఎస్‌ఆర్ కింద లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లవ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణలు నిర్వహించేందుకు ఒక ఏడాది పాటు జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌ను స్వాధీనం చేసేందుకు అనుమతి ప్రతిపాదనపై సభ్యులు చర్చించనున్నారు.

# అయినా.. అప్రమత్తం కావడం లేదు

- సైబర్ నేరగాళ్ల మెసేజ్‌ల వలలో పడి లక్షలు కోల్పోతున్న బాధితులు
- ఎంత ప్రచారం చేస్తున్నా తగ్గని మోసాలు
- పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో వల.. భారీగా మోసాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాలను కట్టడి చేయడానికి సెల్‌ఫోన్ కాలర్ ట్యూన్.. టీవీలు.. సోషల్‌మీడియాల ప్రకటనలతో అవగాహన కల్పిస్తున్నా నేరాలు మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు.. మారుమూల ప్రాంతాలల్లో కూడా ఈ మోసాల పరంపర నడుస్తున్నది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వాట్సాప్‌లకు వస్తున్న మేసేజ్‌లు చూసి మోసపోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. ప్రతి రోజు లక్షల రూపాయలు పోగొట్టుకొని బాధితులు సైబర్‌ఠాణాలో ఫిర్యాదు చేస్తున్నారు. అదే సెల్‌ఫోన్‌తో ఇతరులకు ఫోన్ చేస్తున్న సమయంలో పార్ట్ టైమ్, పెట్టుబడుల పేరుతో వచ్చే మెసేజ్‌లు, ప్రకటనలను చూసి మోసపోవద్దంటూ కాలర్ ట్యూన్‌లో సమాచారం వస్తున్నా... ఆ విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా అదే సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లకు స్పందించి బాధితులు మోసపోతున్నారు.

- మల్కాజిగిరికి చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగికి బ్రాండ్ మార్క్ అసోసియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక మేసేజ్ వచ్చింది, హోటల్స్, రెస్టారెంట్స్‌కు సంబంధించి గూగుల్ రివ్యూస్ రాస్తే ప్రతి రోజు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు సంపాదించవచ్చంటూ మేసేజ్ పంపించారు. ప్రతి రివ్యూకు రూ. 120 సంపాదించవచ్చంటూ నమ్మించి నమ్మకం కోసం మొదట కొంత డబ్బు చెల్లించారు. ఆ తరువాత పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు ఇస్తామంటూ నమ్మిస్తూ దఫ దఫాలుగా రూ. 15.42 లక్షలు లాగేశారు.
- మల్కాజిగిరికి చెందిన ఒక గృహిణి సెల్‌ఫోన్‌కు ఫ్లైప్‌సైడ్ గ్లోబల్ సర్వీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వీన ఖాత్రి అనే పేరుతో ఒక మేసేజ్ వచ్చింది, పార్ట్‌టైమ్ ఉద్యోగాలున్నాయి, మీరు ప్రతి రోజు రూ. వెయ్యి నుంచి రూ. 3 వేల వరకు సంపాదించుకునే అవకాశముంది, గుగూల్ రివ్యూస్ రాస్తే చాలు, ఒక రివ్యూకు రూ. 150 చెల్లిస్తామని ఆ మేసేజ్‌లో పేర్కొన్నారు. దీనికి అంగీకరించిన బాధితురాలు మొదటి సారి గూగుల్ రివ్యూ రాసి రూ.150 పొందింది. రూ. 1000 చెల్లిస్తే ఒకో రివ్యూకు రూ. 400 ఇస్తామంటూ సూచించడంతో వెయ్యి చెల్లించింది. ఆ తరువాత మీరు పెట్టుబడి పెంచితే లాభాలు ఎక్కువగా ఇస్తామంటూ నమ్మించి దఫ దఫాలుగా ఆమె వద్ద నుంచి రూ. 2.21 లక్షలు వసూలు చేసి, మోసం చేశారు.
- ఇంజాపూర్‌కు చెందిన ఒక విద్యార్థికి ట్రాక్సిన్ టెక్నాలజీస్ పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్ ఇస్తుందని, గూగుల్ రివ్యూస్ రాస్తే రూ. వెయ్యి నుంచి రూ. 3 వేల వరకు రోజు వారిగా సంపాదించవచ్చంటూ మేసేజ్ పంపించారు.ఆ మేసేజ్‌కు ఆకర్షితుడైన విద్యార్థి నేరగాళ్లు పంపించిన లింక్‌ను క్లిక్ చేసి ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేశాడు. ఆ తరువాత మీరు కొన్ని టాస్క్‌లు పూర్తి చేస్తే భారీగా డబ్బు సంపాదించవచ్చని, క్రిప్టో కరెన్సీలో ఆ పెట్టుబడి పెట్టాలంటూ సూచించారు. మీరు పెట్టుబడి పెట్టే మొత్తానికి వచ్చే లాభాలు మీకు స్క్రీన్‌పై ఎప్పటికప్పుడు డిస్‌ప్లే అవుతుంటాయని చెప్పాడు. దీంతో బాధితుడు దఫ దఫాలుగా రూ. 3.25 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు.

# షీటీమ్స్.. మరింత దూకుడు

- శివారు ప్రాంతాల్లోనూ ఫిర్యాదులపై దృష్టి
- పోకిరీలపై కేసులు.. అరెస్ట్‌లు

ఆ దంపతులకు 16 ఏండ్ల కిందట పెండ్లయ్యింది. వారికి ఇంటర్ చదివే కూతురు ఉంది. మరో ముగ్గురు పిల్లలు స్కూళ్లో చదువుతున్నారు. రాత్రి పిల్లలు పడుకున్న తరువాత తండ్రి చిన్నారులైన ముగ్గురు పిల్లలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఇదంతా కళ్లారా చూసిన పెద్ద కూతురు విషయాన్ని అమ్మకు చేరవేసింది. తన భర్త వ్యవహారాన్ని భార్య కూడా చూసింది. ఏం చేయాలో తెలియక.. చిన్నారులైన పిల్లలను కాపాడుకునేందుకు ఆ తల్లి చివరకు షీ టీమ్స్‌ను ఆశ్రయించింది. సదరు తండ్రిపై షీ టీమ్స్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

12 ఏండ్ల బాలిక తన నానమ్మ మొబైల్ ఫోన్ ను వాడుతున్నది. ఆ ఫోన్‌లో సోషల్ మీడియా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నది. అపరిచితుడైన ఓ వ్యక్తి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపితే దానికి ఓకే చెప్పి అతనితో చాట్ చేస్తూ ఉన్నది. అతను ఆ చాట్ చేస్తూ ఆ బాలిక ఫొటోలు స్క్రీన్‌షాట్ తీసుకొని వాటిని మార్ఫింగ్ చేసి తిరిగి ఆ బాలికకు పంపి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు షీ టీమ్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు.. నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.

ఒక యవతికి పరిచయం అయిన యువకుడు కొన్నాళ్లు స్నేహంగా ఉన్నాడు. ఆ తర్వాత ప్రేమిస్తున్నానని చెప్పాడు. పెండ్లి కూడా చేసుకుంటానని హామీ ఇచ్చి నమ్మించాడు. దీనికి యువతి కూడా అంగీకరించడంతో కొన్నాళ్లు చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. తీరా పెండ్లి వద్దకు వచ్చే వరకు యువకుడు ముఖం చాటేసి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో యువతి అతని కోసం ప్రయత్నించి లాభం లేకపోవడంతో షీ టీమ్స్‌లో పిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ శారు.

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): షీటీమ్స్ దూకుడు పెంచింది. కేవలం నగరంలోనే కాకుండా శివారుల్లో మహిళలపై జరిగే వేధింపులపై దృష్టి పెంచింది. డెకాయి అపరేషన్లే కాకుండా సోషల్‌మీడియా, ఫోన్ ద్వారా జరిగే వేధింపులపై ఫోకస్ పెట్టి నేరగాళ్లను అరెస్ట్ చేస్తున్నది. కొన్ని ఘటనల్లో కుటుంబ సభ్యులే కొన్ని సార్లు రక్తసంబంధాలు మరిచి కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ షీటీమ్స్‌కు ఫిర్యాదులు అందడం గమనార్హం. ప్రతి నెల షీ టీమ్స్ డెకాయి అపరేషన్లు నిర్వహిస్తూ పోకిరీల భరతం పడుతున్నది. సగటున నెలకు 150 మందికి పైగా పోకిరీలపై కేసులు నమోదు చేస్తున్నది. మరో పక్క షీ టీమ్స్‌కు వచ్చే ఫిర్యాదులను విశ్లేషిస్తూ నిందితులను కటకటాల వెనక్కి పంపిస్తోంది. సోషల్‌మీడియా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని వాటిని ఉపయోగించే మైనర్లను సైతం కొన్ని సార్లు నేరగాళ్లు వదలకుండా ఏదో విధంగా వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. బాధితులు సమస్యలపై సతమతం కాకుండా వెంటనే షీ టీమ్స్‌ను సంప్రదిస్తే వేధింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవచ్చని పోలీసులు సూచిస్తున్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ వాతావారణం ఉండే ప్రాంతాలలోను షీ టీమ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికి షీ టీమ్స్‌పై అవగాహన ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

### ఫిర్యాదులు ఇలా వస్తున్నాయి..

వివిధ రకాలుగా మహిళలపై వేధింపులు జరుగుతున్నాయి. వేధింపులు ఎదుర్కొనే వారిలో కొందరు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. మరికొందరు లోలోపల కుమిలిపోతున్న వారు సైతం ఉ ంటున్నారు. జనవరి నెలలో రాచకొండ షీ టీమ్స్‌కు వచ్చిన ఫిర్యాదులు ఇలా ఉన్నాయి..

**ఫోన్ల ద్వారా వేధింపులు - 33**
**సోషల్ మీడియా యాప్స్ - 44**
**నేరుగా వేధింపులు - 97**
**(ఇందులో 18 మందిపై క్రిమినల్ కేసులు)**

### రూ. 23 వేల లాభం చూపించి..

# రూ. 14 లక్షలు కొట్టేశారు

### పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో ప్రైవేట్ ఉద్యోగికి సైబర్‌చీటర్స్ టోకరా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): స్క్రీన్‌పై లాభాలు చూపిస్తారు. విత్‌డ్రా చేసుకుందామంటే నయాపైసా కూడా రాదు. ఇదే సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ. పార్ట్ టైమ్ ఉద్యోగంతో రోజు వారిగా రూ. వెయ్యి నుంచి రూ. 3 వేల వరకు సంపాదించవచ్చంటూ రూ. 23 వేల లాభం ఆశ చూపిన సైబర్‌నేరగాళ్లు ఓ ప్రైవేట్ ఉద్యోగికి రూ. 14 లక్షలు టోకరా వేశారు. దమ్మాయిగూడెంకు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగికి వాట్సాప్‌కు బ్రాండ్‌మార్క్ ఆసోసియేట్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి అతిధి గుప్త పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. పార్ట్‌టైమ్ జాబ్‌లో హోటల్స్‌కు సంబంధించి గూగుల్‌లో రివ్యూస్ రాయాలని, దాని ద్వారా రోజుకు రూ. 3 వేల వరకు సంపాదివచ్చంటూ సూచించారు. మొదట వందల్లో లాభాలు చూపించారు. తరువాత బిట్‌కాయిన్‌లో ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలొస్తున్నాయని ఒక యాప్ లింక్‌ను డౌన్‌లోడ్ చేయించారు. మొదట తక్కువ మొత్తం పెట్టుబడి పెట్టడంతో లాభాలు వచ్చాయి. దీంతో అది నిజమని నమ్మిన బాధితుడు లక్షల్లో పెట్టుబడిపెడుతూ వెళ్లాడు. అయితే స్క్రీన్‌పై లాభాలు కన్పించినా వాటిని విత్‌డ్రా చేసుకునే వీలు లేకుండా పోయింది. ఇలా రూ. 14, 24,004 పెట్టుబడి పెట్టగా సైబర్‌నేరగాళ్లు రూ. 23120 లాభం అంటూ ఇచ్చారు, ఇలా మొత్తం మీద రూ. 14,00,884 నష్టపోయిన తరువాత బాధితుడు ఇదంతా మోసమని గుర్తించి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.